RNI Reg-No. APTEL/2002/07373

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

Postal Registration No.VJ/215/2025-27

సంపుటి :24 Vol. No.24 సంచిక : 57 Issue No. 57 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: మంగళవారం 24-02-2026 Tuesday, February 24 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

● ఇప్పటికే నలుగురు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం

● పాలవ్యాపారి గణెళిశ్ అరెస్ట్.. పరీక్షలకు పాల నమూనాలు


**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, మిగతా 2లో..

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.. భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా మిగతా 2లో..



# మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం ఘటనపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన

**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల మిగతా 2లో..

## ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు.. గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి మిగతా 2లో..

## సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత

కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం సుగమం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్, కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

■ నేడు అసెంబ్లీలో వివరాలు ప్రవేశ పెడతాం

■ వైకాపా దేవదేవుడిని రోడ్డుకు లాంగింది

■ మీడియాతో మంత్రి లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలో కొలువుదీరిన దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగా బయటపెడతామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలన్నీ మంగళవారం అసెంబ్లీలో మిగతా 2లో..

## అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే టార్గెట్ చేస్తున్నారు

టీవీకే చీఫ్ విజయ్



**చెన్నై, ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** ప్రభుత్వాల అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తూ.. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే అందరూ తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని టీవీకే చీఫ్ విజయ్ ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు కూడా డీఎంకే ప్రభుత్వం అనుమతి ఇవ్వట్లేదన్నారు. అందువల్లే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని వెల్లడించారు. టీవీకే ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. వెనక్కి తగ్గనని అవినీతిని ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. వేలూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అవినీతి, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమయ్యిందని విజయ్ ఆరోపించారు. త్వరలో జరగనున్నవి ఎన్నికలు కాదని తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి మధ్య యుద్ధమని అన్నారు. ఈ యుద్ధంలో ప్రజలే విజయం సాధిస్తారన్న మిగతా 2లో..

## పాలకల్తీ మరణాలపై చంద్రబాబు ఆరా

అధికారులతో సమీక్షించి తక్షణ చర్యలకు ఆదేశం



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికుల అస్వస్థత, మరణాలపై సీఎం చంద్రబాబు ఆరా తీసారు. పాలకల్తీ వ్యవహారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్‌గా ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న సాయాన్ని సీఎంకు వారు వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు. అధికారులు వెంటనే మిగతా 2లో..

## సత్ప్రవర్తన ఖైదీలకు క్షమాభిక్ష

❑ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న హోంమంత్రి

❑ జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లుపై అనిత



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల మిగతా 2లో..

## రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు

బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ మిగతా 2లో..

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి!

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అడపాదడపా గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను పట్టుకుంటున్నా..అదేమంత పెద్ద మొత్తంలో కాదని తెలుస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తోంది. రోజూ ఎక్కడోచోట దాడుల్లో మత్తు పదార్థాలను పట్టుకుంటూనే ఉన్నారు. అయినా రవాణా ఆగడం లేదు. దొరికిన వారిని ఎన్‌కౌంటర్ చేస్తే తప్ప రవాణా ఆగదేమో అన్న ఆందోళన కలుగుతోంది. నిరుద్యోగులు దీనిని ఓ ఉపాధిగా ఎంచుకోవడం వల్లనే రవాణా సులభంగా మారింది. దీనికితోడు దీంతో డబ్బులు కూడా బాగా రావడంతో యువత దీనిని ఉపాధిగా ఎంచుకుని ఈ ఉచ్చులో దిగుతున్నారు. దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టాల్సి ఉంది. యువత పెడమార్గం పట్టకుండా వారికి ఉపాధి చూపాలి. స్కూలుస్థాయిలోనే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. కాలేజీల్లో నిఘా పెంచాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడడం లేదు. ముఖ్యంగా యువత మత్తుకు అలవాటు పడి దుర్మర్గాలకు దిగుతున్నారు. మత్తు మనిషిలోని విచక్షణను హరించి వేస్తోంది. ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఓ హెచ్చరిక కావాలి. ఇదొక్కటే కాదు ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయి. మత్తులో ఓ మైనార్ బాలికను కొందరు సామూహిక అత్యాచరరం చేసారు. అభంశుభం తెలియని పసిపాపను చిదిమేసిన ఘటనలో కులవర్ధన్ అనే దుర్మార్గుడు ఆత్మహత్ చేసుకున్నా సంతోషించడానికి లేదు. నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే- పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే ? దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది. ఈ ఘటన యువతలో మార్పు తీసుకుని వస్తుందని అనుకోవడం భ్రమే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం ఆందోళన కలిగించేలా ఉంది. దాని నియంత్రణకు,నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగు తున్నందుకు కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. వరుసగా జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు విపరీతంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తోనో, జైల్లో వేస్తోనే, లేదా వారే తీసుకుంటేనో ఈ సమస్యకు పరిష్కారం దక్కదు. విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల రవాణాను సవాల్‌గా తీసుకోవాలి. కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రభుత్వాలు నిచేయాలి. అవసరమైతే ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చవుతుందని ఒక అంచనా. చికిత్సకు వెళ్లకుండానే కొందరు మత్తులనే కుప్పకూలి పోతున్నవారు దేశంలో 2003 - 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే- తరువాతి పదేళ్ల కాలంలో అంటే 2014 - 2025 మధ్య కాలంలో రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్త మవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియాన్స్ వీసా గడువు ముగిసినా ఇక్డే తిష్టవేసి మత్తు వ్యాపారం చేస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించాలి. మత్తు పదార్థాల రవాణను అరికట్టేందుకు ఆపరేషన్ చేపట్టాల్సిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున బలగాలను వినియోగించాలి. యువతను కాపాడుకోవడానికి ఎంత కఠినమైన చర్యలకైనా వెనకాడరాదు.

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

### సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం... మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి.. అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల




**వాషింగ్టన్, ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ ప్రక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్దీ దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4-10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# జిల్లాలా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

### మాజీమంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్‌ల భేటీ... బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా

**ఆదిలాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని, జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 14 మంది గెలిచినా మంత్రి వివేక్ అధికార దౌర్జన్యంతో ఎన్నికలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి బీఆర్ఎస్ నాయకులపైనే కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. సుమన్ పై ఉన్న పాత కేసులు తోడి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకుంటామని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జైలులో అధికారులు సుమన్‌ను మానసిక శోభకు గురి చేస్తున్నారని, దోమలు బాగా ఉన్న పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తెలిపారు. కొంత అనారోగ్యానికి గురైన వైద్యం అందించడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఇదిలావుంటే రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్ పై వాదనలను కోర్టు నేటికి వాయిదా వేసింది. జిల్లా జైలులో ఉన్న బాల్కసుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణకు రాగా కోర్టు పరిశీలించింది.కౌంటర్ పిటిషన్ పై గడువు కావాలని పోలీసులు కోరగా బెయిలు పిటిషన్ పై వాదనలను రేపటికి వాయిదా వేసింది. జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించింది. పోలీసులను, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్కసుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది . గత వారం రోజులకు పైగా సుమన్ మంచిర్యాల జిల్లా జైలులో ఉన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బంద్ నిర్వహించాయి .

# కనీస వేతనలు 26వేలకు పెంచాలి

### చీపురుపల్లిలోలో అంగన్‌వాడీల ఆందోళన

చీపురుపల్లి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు ఆధ్వర్యంలో చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అంబాల గౌరి నాయుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టీ మాలతి, నాగమణి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్వాడీలను ఇబ్బందులు గురిచేస్తుందని వారు అన్నారు. ఫిబ్రవరి నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లను క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంట్రల్ గా మార్చాలని వారు కోరారు. గ్రాట్యూటీ అమలకు గిల్డైన్స్ రూపొందించి వేతనముతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ మరియు రూరల్ అనే తేడా లేకుండా అందరికీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లు నిర్దిష్టమైన గిల్డైన్స్ రూపొందించి అమలు చేయాలని అలాగే పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వాడు ప్రభుత్వాన్ని కోరారు. మే నెల అంతా వేసవి సెలవుల జీవో ప్రకటించాలని కోరారు. వీటితోపాటు లబ్దిదారులకు బియ్యం ఆయిల్ కందిపప్పు లకు సంబంధించి క్వాంటిటీ పెంచాలని మెనూ చార్జీలు పెంచడంతోపాటు ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు అంతేకాకుండా ప్రీస్కూల్ బలోపేతం చేయాలని ఫ్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందన పథకాన్ని అమలు చేయాలని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడి సెంటర్ లో ఉండాలని జీవో ఇవ్వాలని వర్కోరారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే తాము ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# జాతరలో అమానుష ఘటన

### చర్యలు తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** కుమ్మేరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, నేతలు స్వామి యాదవ్ ,రాజు తదితరులున్నారు.

# ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

### డిఎస్సీ కూడా అందులోనే ఉంటుంది... ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి లోకేశ్ సమాధానం



**అమరావతి ,ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ(ఆ÷ూఅ) పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల పరిస్థితితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నాణ్యత లేని, కలుషిత ఆహారం పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో వందలాది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. ఇటీవలే నాగర్‌కర్నూల్ సంఘటన మరవకముందే జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడురు గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

# తిరుమలలో నాకాబందీ

### విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు... ఆరు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు



**తిరుమల,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** తిరుమలలో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో బాలాజీ నగర్ ప్రాంతంలో విస్తృత స్థాయి నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ శాఖ, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బిడి టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ శాఖలకు చెందిన సుమారు 90 మంది సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 6 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో బాలాజీ నగర్ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా టీటీడీ కేటాయించిన నివాసాల్లో అనుమతిపొందిన వ్యక్తులే ఉంటున్నారా లేదా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా నివసిస్తున్నారా అనే కోణంలో పరిశీలన చేపట్టబడింది. ప్రతి విభాగం వారు తమ తమ శాఖలకు సంబంధించిన అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ నాఖాబందీ కార్యక్రమంలో మొత్తం 820 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన గుర్తింపు కార్డులు లేని 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే గుర్తింపు పత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానికులతో సమావేశమై, తమ ఇళ్లను అపరిచిత వ్యక్తులకు బాడుగకు ఇవ్వవద్దని, సరైన గుర్తింపు లేకుండా ఎవరినీ పనులకు నియమించవద్దని సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. స్థానిక నివాసులు ఈ నాఖాబందీ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకారం అందించగా, తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో ఈ తనిఖీలు చేపట్టారు.

# వారానికి ఒకసారి 'ఉపవాసం' చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు మీకు తెలుసా?

శరీరంలో జీవక్రియను పునరుద్ధరించడానికి ఉపవాసం ఉత్తమ మార్గం. నీటి ఉపవాసం శరీరాన్ని శుభ్రపరచడానికి, బరువును తగ్గించడానికి మరియు రక్తపోటును తగ్గించడానికి సహాయపడుతుంది. కానీ ఉపవాసం వల్ల కలిగే ప్రయోజనాలకు ప్రతికూలతలు ఉన్నాయి.
మీ కోసం ఉపవాసం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆ ఉపవాసం ఎలా చేయాలి, ఎవరు ఉపవాసం ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు మరియు చాలా రోజుల తరువాత తలెత్తే సమస్యల గురించి వివరంగా చూడండి.

**నీటి ఉపవాసం అంటే ఏమిటి?**

నీటి ఉపవాసం ఒక రకమైన ఉపవాసం. ఈ ఉపవాసం సమయంలో మీరు నీరు మాత్రమే తాగాలి. ఈ ఉపవాసం 24 నుండి 72 గంటలు చేయవచ్చు. ఒకరు నీటితో ఉపవాసం ఉండాలనుకుంటే, దాని గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. మీ కోసం పూర్తి వివరణ క్రింద ఉంది.

**నీటితో ఉపవాసం- ప్రయోజనాలు:**

**రక్తపోటును తగ్గిస్తుంది**

జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల చాలా మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. రక్తపోటును తగ్గించడానికి నీటి ఉపవాసం గొప్ప మార్గం. రక్తపోటు సమస్య తీవ్రస్థాయిలో ఉన్న 68 మంది వైద్యుల సిఫారసు మేరకు ఉపవాసం చేయించుకున్నారని, రక్తపోటు 82% తగ్గుతుందని అమెరికన్ పరిశోధకులు కనుగొన్నారు. మరో అధ్యయనంలో రక్తపోటు ఉన్న 174 మంది ఉన్నారు. ఈ అధ్యయనంలో, 90% మంది రక్తపోటు కోసం సూచించిన మాత్రలను విజయవంతంగా వదులుకున్నారు. ఆ స్థాయిలో వారి రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యం వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఉపవాసం ఉండటం వల్ల తినే కేలరీలు తగ్గుతాయి. ఫలితంగా, శరీర బరువు తగ్గుతుంది. ఇది వివిధ రకాల గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. తరచుగా ఉపవాసం మీకు బరువు తగ్గడానికి మరియు చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి సహాయపడుతుంది, లెప్టిన్ మరియు ఇన్సులిన్ వంటి వ ృద్ధి కారకాల స్థాయిలను తగ్గిస్తుందని పరిశోధకులు అంటున్నారు.



**ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది**

అనారోగ్యకరమైన జీవనశైలి మరియు చెడు అలవాట్ల కారణంగా, రియాక్టివ్ ఆక్సిజన్ జాతులు (ఆర్ఒఎస్) స్తబ్దంగా మారతాయి మరియు శరీర కణాలు, డిఎన్ఎ, ప్రోటీన్లు మరియు కణాల ఆకారాన్ని ప్రభావితం చేస్తాయి. ఒక వ్యక్తి శరీరం అతిగా స్పందిస్తే, అది యాంటీఆక్సిడెంట్ ఒత్తిడి మరియు మంటను పెంచుతుంది. నీరు మాత్రమే తీసుకుని ఉపవాసం ఉంటే, రియాక్టివ్ ఆక్సిజన్ జాతులు పూర్తిగా తొలగించబడతాయి.

**శరీరాన్ని శుభ్రపరుస్తుంది**

సాధారణంగా శరీరం తనను తాను శుభ్రపరుస్తుంది. శరీరం అలా చేయలేకపోయినప్పుడు, శరీరం టాక్సిన్స్ మొత్తాన్ని పెంచుతుంది, ఇది క్యాన్సర్ వంటి పెద్ద వ్యాధులకు దారితీస్తుంది. వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఉపవాసం ఉండటం ద్వారా, శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా నిరోధించడం ద్వారా మీ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవచ్చు.

**రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది**

ఉపవాసం నీరు శరీరం యొక్క రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. శరీరంలోని అదనపు విషాన్ని బయటకు తీయడానికి నీరు సహాయపడుతుంది. అందువలన కణాలు అంతరాయం లేకుండా సాధారణంగా పనిచేయడం ప్రారంభిస్తాయి. ఫలితంగా, రోగనిరోధక వ్యవస్థ మెరుగ్గా పనిచేయడం ప్రారంభిస్తుంది.

**ఇన్సులిన్ మరియు లెప్టిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది**

రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే మరియు ఆకలిని ప్రేరేపించే హార్మోన్లు ఇన్సులిన్ మరియు లెప్టిన్. ఉపవాసం శరీరం యొక్క ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది, మధుమేహం మరియు ఊబకాయం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. లెప్టిన్ ఆకలికి కారణమయ్యే హార్మోన్. లెప్టిన్ సున్నితత్వం మెరుగుపడినప్పుడు, అధికంగా తినడం నిరోధించబడుతుంది మరియు ఊబకాయం నివారించవచ్చు.

**దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది**

ఉపవాసం దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. క్యాన్సర్, డయాబెటిస్ మరియు గుండె జబ్బులతో పాటు, ఉపవాసం దీర్ఘకాలిక మంట మరియు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను కూడా నివారించవచ్చు మరియు జ్ఞాపకశక్తి కోల్పోవడం మరియు ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గిస్తుంది.

**ఎన్ని రోజులు వాటర్ ఫాస్టింగ్ చేయవచ్చు?**

వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఉపవాసం ఉండటం మంచిది. అందువల్ల మీరు నీటి ఉపవాసం యొక్క పూర్తి ప్రయోజనాన్ని పొందవచ్చు.
ఉపవాసానికి ముందు, మీ వైద్యుడిని సంప్రదించి అతని అనుమతి

# జుట్టు పెరుగుదలను పెంచాలనుకుంటున్నారా? నిమ్మకాయను వాడండి



ఆరోగ్యకరమైన, పొడవాటి జుట్టును ఎవరు కోరుకోరు? ప్రస్తుతం ప్రజలు తమ జుట్టు ఆరోగ్యం మరియు అందంగా మెరుగుపర్చడానికి ఎక్కువ డబ్బు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. దీని ప్రకారం, జుట్టు పెరుగుదలను పెంచడానికి సీరం, నూనెలు మరియు షాంపూలు వంటి జుట్టు సంరక్షణ ఉత్పత్తులను చాలా దుకాణాల్లో విక్రయిస్తారు. అవి ఎంత ఖరీదైనప్పటికీ, ప్రజలు డబ్బు గురించి చింతించకుండా వాటిని కొనుగోలు చేస్తారు. కానీ మన ఇంట్లో అద్భుతమైన ఉత్పత్తిని ఉపయోగించకుండా జుట్టు సంరక్షణ ఉత్పత్తుల కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా, జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. జుట్టు అభివృద్ధికి ఎలాంటి పదార్థం సహాయపడుతుందని మీరు అడగవచ్చు. ఇది నిమ్మరసం తప్ప మరేమీ కాదు.
అత్యంత ప్రాచుర్యం పొందిన సిట్రస్ పండ్లలో ఒకటి నిమ్మకాయ, నిమ్మకాయలోని విటమిన్ సి మీ జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది మరియు చుండ్రు మరియు అదనపు ఆయిల్ గ్లో వంటి జుట్టు సమస్యలకు మంచి నివారణ. అందుకు నిమ్మరసం ఎలా ఉపయోగించాలో. మీరు చదివి అనుసరిస్తే, మీ జుట్టు పొడవుగా మరియు ఆరోగ్యంగా పెరుగుతుంది. షాంపూతో నిమ్మరసం జుట్టు సమస్యలను పరిష్కరించడానికి నిమ్మరసం నేరుగా తలపై వేయకూడదు. నిమ్మకాయలోని ఎసిటిక్ గుణాలు తలపై చికాకు మరియు దురదకు కారణమవుతాయి. కావాలనుకుంటే షాంపూతో పాటు నిమ్మరసాన్ని ఉపయోగించవచ్చు. తేలికపాటి షాంపూతో 1 స్పూన్ నిమ్మరసం కలపండి, మీ తలపై రుద్దండి మరియు చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. దీనివల్ల జుట్టు చక్కగా కనిపిస్తుంది.
కొబ్బరి నూనెతో నిమ్మరసం కొబ్బరి నూనెతో నిమ్మరసం కలిపితే చుండ్రును వదిలించుకుని స్కాల్ప్ ఫీడ్ పొందుతారు. నిమ్మకాయలోని ఎసిటిక్ మరియు యాంటీ బాక్టీరియల్ లక్షణాలు కొబ్బరి నూనె నెత్తికి పోషణ మరియు పోషణను అందిస్తాయి. కొబ్బరి నూనెతో 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపండి, తలపై రాయండి, సున్నితంగా మసాజ్ చేయండి, 1 గంట నానబెట్టండి, తరువాత తేలికపాటి షాంపూతో శుభ్రం చేసుకోండి. బాదం నూనెతో నిమ్మరసం బాధిత జుట్టు నివారణకు, నిమ్మరసాన్ని తేనె మరియు బాదం నూనెతో కలపండి, నెత్తిమీద పూయండి మరియు కొద్దిసేపు మెత్తగా మసాజ్ చేయండి.
పెరుగు నిమ్మరసం ఒక గిన్నెలో ఒక కప్పు పెరుగు తీసుకొని, 1 స్పూన్ నిమ్మరసంతో కలపండి, తలపై అప్లై చేసి, సున్నితంగా మసాజ్ చేయండి, కొద్దిసేపు నానబెట్టి, తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఈ హెయిర్ మాస్క్ చుండ్రును తొలగిస్తుంది, తలకు అవసరమైన పోషకాలను అందిస్తుంది మరియు జుట్టు బాగా పెరగడానికి సహాయపడుతుంది. మంచి ఫలితం కోసం వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వాడండి. వేపతో నిమ్మరసం మీరు నిమ్మరసం వేప ఆకులతో కలిపితే, మీరు చుండ్రు నుండి బయటపడతారు మరియు తలపై కలిగే ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుండి బయటపడతారు. వేప ఆకును గ్రైండ్ చేసి పేస్ట్ చేసి, 2 స్పూన్ల నిమ్మరసం వేసి, స్కాల్ప్ కు అప్లై చేసి, 1/2 గంటలు నానబెట్టి, తరువాత తేలికపాటి షాంపూతో శుభ్రం చేసుకోండి. దీన్ని వారానికి రెండుసార్లు ఉపయోగించడం మంచిది.
గుడ్డులోని తెల్లసొనతో నిమ్మరసం ఒక గిన్నెలో గుడ్డులోని తెల్లసొన తీసుకోండి, 2 స్పూన్ల నిమ్మరసంతో బాగా కలపండి. తరువాత మిశ్రమాన్ని జుట్టు మరియు తలపై రాయండి, 20 నిమిషాలు నానబెట్టి, ఆపై తేలికపాటి షాంపూ వేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది మరియు జుట్టు బాగా పెరుగుతుంది. నీటితో నిమ్మరసం ఒక కప్పు నీటిలో 3-4 టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలపండి. తలకు షాంపూ చేసి, సాధారణ నీటితో శుభ్రం చేసుకోండి, ఈ నిమ్మరసంతో మీ తలను శుభ్రం చేసుకోండి. దీన్ని తలకు రాసి కొన్ని నిమిషాలు నానబెట్టి, ఆపై మీ జుట్టును శుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా చేసేటప్పుడు కళ్ళు మూసుకుని ఉండండి. మీ జుట్టు ప్రకాశవంతంగా మరియు ఆరోగ్యంగా కనిపించే విధంగా వారానికి ఒకసారి ఈ విధానాన్ని పాటించండి.

# పోలీస్ అధికారి సునీల్ కుమార్‌కు చుక్కెదురు

## సస్పెన్షన్ పొడిగించిన ప్రభుత్వం

**అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా పదవీవిరమణ వరకు ఇక విధుల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకూ లేదా పదవీ విరమణల్లో ఏది ముందైతే అప్పటి వరకూ సస్పెన్షన్‌లో కొనసాగించాలని కమిటీ చేసిన సిఫారసులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలపై సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం తొలుత 2025 మార్చి 2న సస్పెండ్ చేసింది. అప్పటి నుంచీ ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు.

# నది దాటుకుంటూ వచ్చిన విద్యార్థులు

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని హాజరు



**విజయవాడ, ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** మన్యం జిల్లాలోని నాగవల్లి నది దాటుకుంటూ ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు రాయడానికి విద్యార్థులువెళ్లారు. వేరే మార్గం లేక వారు నది దీటుకుంటూ వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం చాణక్య కాలేజీకి చెందిన యర్రా హేమశ్రీ ఉప్పులూరు గ్రామానికి చెందిన విద్యార్థి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినా సోమవారం ఇంటర్ మీడియట్ పరిక్షలకు తన తండ్రి సహకారంతో హజరైనట్లు చాణక్య కాలేజీ ప్రతినిధి చెప్పారు. హేమశ్రీ తన కాలేజీలో బెస్ట్ విద్యార్థిని చెప్పారు. నడవలేని స్తితిలో ఉన్నప్పటి హేమశ్రీ పరిక్షలకు హజరైనట్లు చెప్పారు. మార్చి 24 వరకు జరగనున్న పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సిసిటివి కెమెరాల నిఘా ఉంటుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా స్థాయి పరీక్షా కమిటీలు (డిఇసి), ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం తనిఖీలు చేస్తాయని పేర్కొన్నారు. పరీక్ష సమయం దాటి నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అత్యవసర సమస్యల కోసం బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబరు 18004251531కు ఫోన్ చేయాలని వెల్లడించారు.



# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

## మున్సిపల్ ఎన్నికలల్లో డ్రామా నడిపించారు... డ్రామాలతో కాలం గడుపుతున్న సిఎం రేవంత్... మండిపడ్డ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు మొత్తాన్ని ఒక డ్రామా నడిపించారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క రోజూ మున్సిపాలిటీల అభివృద్ధి గురించి చెప్పలేదని సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, ఒక డాక్టర్‌గా, రాజ్యాంగాన్ని నమ్ముకున్న వ్యక్తిగా అన్ని వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ముందు మా నాయకుడు హరీశ్‌రావు సిట్ పేరుతో నోటీసులు ఇచ్చి మొదటి డ్రామాకు తెరలేపారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమైనా ఉందా అంటే మన్ను లేదు మశానం లేదని అన్నారు. దావోస్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విహార యాత్రకు చేశాడని.. మొత్తం 12 రోజుల పాటు వెళ్లిన ముఖ్యమంత్రి , దావోసు నుండి తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు గురించి చెప్పలేదని పేర్కొన్నారు. పెట్టుబడులపై మంత్రి శ్రీధర్ బాబు అయినా మాట్లాడతాడని అనుకుంటే ఆయన కూడా మాట్లాడలేదని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను విహార యాత్ర అంటున్నామని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తెలంగాణ జాతిపిత అయిన కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులిచ్చి రెండో డ్రామాకు తెరలేపారని సంజయ్ మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చడంలో రేవంత్ రెడ్డి ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో సభలు నిర్వహిస్తాడని.. మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పుడు గ్రామ పంచాయతీలో సభలు నిర్వహిస్తాడని చెప్పారు. ఏదో ఒక రకంగా ప్రజలను రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నాడని మండిపడ్డారు. ఇతర పార్టీలతో అంటకాగేది రేవంత్ రెడ్డి అని.. కానీ బీఆర్ఎస్‌కు బీజేపీకి లింక్ పెడుతున్నారని విమర్శించారు. వీణా వాణి గురించి నీచంగా మాట్లాడిన వ్యక్తి రేవంత్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రానికి ముమ్మాటికి జాతిపిత కేసీఆరే అని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని.. తగిన సమయంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమని సంజయ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు కేసీఆర్ ను తిట్టడం తప్పా, అభివృద్ధి గురించి మాట్లాడడం లేదని తెలిపారు. తప్పులు చేస్తే చెప్పండి అని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, ప్రతిరోజు తప్పులు చేస్తూనే ఉన్నాడని పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బ్జడెట్ సమావేశాల్లో నిజాయితీగా ప్రజల సమస్యల పై చర్చ చేయాలన్నారు. ఈ బ్జడెట్ లో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలకు నిధులు కేటాయించకపోతే వారందరూ కలిసి కాంగ్రెస్‌కుబుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ బ్జడెట్ సమావేశాల్లో రేవంత్ రెడ్డికి ఫేవరేట్ స్జబెక్ట్ అయిన రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడుదామని తెలిపారు. సమావేశాలకు వచ్చే ముందు దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలుసుంటే బావుంటుందని రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఎట్టకేలకు దేవాదుల ప్రాజెక్టు దగ్గరకు వెళ్లినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామ రక్ష అని రేవంత్ రెడ్డికి తెలుసు అని సంజయ్ అన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాల్సిందేనని తెలిపారు. బ్జడెట్ సమావేశాల్లో మాకు మైక్ ఇవ్వమని చెప్పండి, జలాల పై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజిని లాంటి వాడు, ఆయన చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని విమర్శించారు. ఈసారి అయిన అసెంబ్లీని గౌరవించి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. పార్టీ మారారని ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌పై అనర్హత వేటు వేశారని సంజయ్ తెలిపారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా స్పీకర్ వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ కు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రచారం చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు.

# అనూరియా వ్యాధిపై ఇంటింటి సర్వే

## 73 శాంపిల్స్ సేకరించి పరీక్షలకు అందచేత... నలుగురు మృతి..12 మంది ఆస్పత్రుల్లో చికిత్స... అధికారులతో కలసి సమీక్షించిన కలెక్టర్ కీర్తి

**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆర్ఎన్ఎ):** అనూరియా వ్యాధితో రాజమహేంౖ దవరంలో ఆసుపత్రుల్లో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరిందని జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని ఆమె తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇంటింటా సర్వే నిర్వహించి 73 శాంపిల్స్ సేకరించామని వివరించారు. అలాగే పాల వ్యాపారికి చెందిన 42 గేదెల నుంచి పాలు సేకరించి.. ఆ శాంపిల్స్‌ను కూడా హైదరాబాద్ ల్యాబొరేటరీలకు పంపామన్నారు. రాజమహేంద్రవరంలో చోటు చేసుకున్న అనూరియా అంటే మూత్రం నిలిచిపోవడంపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన అంశాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ÷ూజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 15 నుంచి పలువురు వాంతులవడం, మూత్ర విసర్జన కాకపోవడం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రకమైన కారణాలతో 14 మంది నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో బి.కనకరత్నం(76), తాడి కృష్ణవేడి(75) ఇప్పటికే మృతిచెందారు. వ్యాధికి గురైన వారిలో 60 ఏళ్లు పైబడిన వారే అధికంగా ఉన్నారు. 5 నెలల శిశువుతో పాటు మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే అనూరియా వ్యాధి బారినపడిన వారందరికి ఒకే వ్యక్తి పాలు సరఫరా చేస్తున్నట్లు వైద్యాధికారులకు బాధితులు వెల్లడించారు. దీంతో పాల కల్తీ జరిగి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. శివరాత్రి అంటే.. ఫిబ్రవరి 15న పాలు,పెరుగు చేదుగా అనిపించాయని బాధితులు వివరించారు. దీంతో పాల సదరు వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే బాధితుల రక్త, మూత్ర నమూనాలను ల్యాబ్‌కు పంపారు. ఆ నమూనాలకు నివేదికలు అందాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఇందులో కొత్త కేసులేవి నమోదు కాలేదని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

## నందిగామలో నీటి కోసం నిరసనలు...



**నందిగామ ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని 20వ వార్డు అనాసాగరంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం గ్రామ నాయకుడు కర్రి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి కొరత తీవ్రంగా ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనాసాగరంలో నిర్మాణం ప్రారంభించిన మంచినీటి ట్యాంక్ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి వేసవిలో నీటి కోసం మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంక్ పూర్తి అయితే గ్రామానికి సమృద్ధిగా తాగునీరు అందే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టిన కర్రి వెంకటేశ్వరరావు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే పనులు ఆలస్యానికి కారణమని ఆరోపించారు. ఇప్పటికే పనులకు నిధులు మంజూరైనప్పటికీ అమలు విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న ఎండాకాలంలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారనుందని, అధికారులు వెంటనే స్పందించి పనులు వేగవంతం చేయాలని కోరారు. అవసరమైతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ ప్రజలు కూడా ట్యాంక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల కష్టాలు తొలగించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మునేరు ఇసుక దోపిడి... తెలంగాణకు జోరుగా రవాణా!



**నందిగామ ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జగ్గయ్యపేట మండలం పోలంపల్లి గ్రామ పరిధిలోని మునేరు వాగు నుంచి తెలంగాణ రాష్ట్రానికి భారీ ఎత్తున అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతోందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ దందా నిరాటంకంగా కొనసాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్నప్పటికీ, కొంతమంది దాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక అవసరాలకు సరిపడా ఇసుక అందకపోతే భవిష్యత్తులో గృహ నిర్మాణాలు, చిన్నపాటి పనులు నిలిచిపోతాయేమోనన్న భయం గ్రామస్తుల్లో నెలకొంది. మునేరు నుంచి అనధికారికంగా ఇసుకను తవ్వడం వల్ల భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. వాగు పరిసర ప్రాంతాల్లో గోతులు పెరగడంతో రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట పొలాలకు వెళ్లే మార్గాలు దెబ్బతిన్నాయని వారు చెబుతున్నారు. ఈ అక్రమ రవాణా వ్యవహారం ఫిబ్రవరి 22, 2026న వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. వెంటనే తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాను అరికట్టాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకుంటాయా? లేక అక్రమ రవాణా యథావిధిగా కొనసాగుతుందా? అన్నది చూడాల్సి ఉంది. ప్రజల ఆందోళనకు అధికారులు స్పందించి మునేరు పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయం పిజిఆర్ఎస్ లో 117 ఫిర్యాదులు



**పల్నాడు ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన PGRS కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ బి.కృష్ణారావు, ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్ అదనపై ఎస్పీ ఎం లక్ష్మీపతి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు PGRS లో ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, పలు మోసాలకు సంబంధించిన సమస్యలు, బెదిరింపులు, ఆక్రమణలు వంటి పలు అంశాలకు సంబంధించిన 117 ఫిర్యాదులను ప్రజలు పోలీస్ అధికారులకు అందజేయగా,వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించే పోలీస్ అధికారులకు వాటిని రిఫర్ చేయడం జరిగింది. PGRS లో వచ్చిన మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సారించి,క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసి, చట్ట ప్రకారం వారికి న్యాయం చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు.

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**పల్నాడు ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లాలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను సోమవారం కలెక్టర్ కృతిక శుక్లా స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలోని కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా గదులను పరిశీలించారు. పరీక్షలు ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు తాగునీరు వంటి కనీస వసతుల్లో ఇబ్బంది కలగకూడదని అధికారులను ఆదేశించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలి

### 151 అర్జీల స్వీకరణ - కలెక్టర్ కృత్తిక శుక్ల



**పల్నాడు ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల అర్జీలను స్వీకరించారు. - జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 151అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. - లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## గౌరవ వేతనం కోసం గళమెత్తిన అంగన్వాడీలు...



**నందిగామ మైలవరం ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేతనాల పెంపు సహా పలు డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆందోళనలు మైలవరం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో అంగన్వాడీ సిబ్బంది హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ శారద, ఆర్ఆర్ వి. పుష్పకుమారి మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమతో వెట్టిచాకిరి చేయిస్తున్నాయంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా వేతనాలు పెంచిన దాఖలాలు లేవని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గౌరవ వేతనాలు సవరించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడీ సేవల పరిధి విస్తరించినప్పటికీ సిబ్బందిపై పనిభారం మాత్రం తగ్గలేదని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పని భారాన్ని తగ్గించి, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు. కేంద్ర పథకాల అమలు, సర్వేలు, పోషణ కార్యక్రమాలు, ప్రీ-స్కూల్ బోధన వంటి విభిన్న బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ తగిన పారితోషికం అందడం లేదని పేర్కొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన యాప్స్ సరిగా పనిచేయకపోవడంతో రాత్రి 12 గంటల వరకు డేటా ఎంట్రీ చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా మానసిక ఒత్తిడి పెరుగుతోందని, దీనిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పదవీవిరమణ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొని ఐక్యత చాటారు. ప్రభుత్వ స్పందనపై అందరి దృష్టి నిలిచింది.

## కృత్రిమ అవయవాల ఏర్పాటుకు కొలతలు స్వీకరణ శిబిరం



**మచిలీపట్నం ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం లోని బృందావనపుర కళ్యాణ మండపం నందు సోమవారం కృష్ణాజిల్లా చాంబర్ అఫ్ కామర్స్ , బ్రహ్మ సమాజం దివ్య దయాగ్నస్టిక్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ పాదాలు ఉచితంగా ఇస్తున్నారు. ఈ కృత్రిమ పాదాలు అవసరమైన దివ్యాంగులను ఎంపిక చేయుటకు శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరానికి చుట్టుపక్కల ఉన్న ఐదు జిల్లాల నుండి వచ్చిన దివ్యాంగులలో సుమారు 128 మంది దివ్యాంగులు అర్హత పొంది తమకు కావలసిన అవయవాలు ఏర్పాటు చేసేందుకు కొలతలు ఇచ్చారు. వీరికి కృత్రిమ అవయవాలు తయారుచేసి మార్చి 23వ తేదీన అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మద్దుల గిరీష్ కుమార్, అధ్యక్షులు ఎండూరి సురేష్, దాత్రి సురేష్, దివ్య రాంబాబు పర్యవేక్షించారు.

## శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం



**అంబాజీపేట ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టే కులగణన ద్వారా శెట్టిబలిజలు రాజ్యాధికారం చేపట్టేలా పోరాటం చేయాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో శెట్టిబలిజ సంఘ ఆహ్వాన కమిటీ నాయకులు విత్తనాల ఇంద్రశేఖర్, మట్టపర్తి సతీష్, రాయుడు షణ్ముక్, సంసాని మురళి, దొంగ హరి, మట్టపర్తి విజయ్ తదితరుల పర్యవేక్షణలో శెట్టిబలిజ స్థూపాన్ని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఎంఎం శెట్టి అధ్యక్షతన జరిగిన శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వాలు బీసీలకు భయపడి కులగణన చేపట్టాయని, దీంతో పాటు జాతి గణన చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికల్లో ఇతర బీసీ కులాలను కలుపుకొని శెట్టిబలిజలు రాజ్యాధికారం చేపట్టాలన్నారు. శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముఖ్యభూమిక వహిస్తుందనడంలో సందేహం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో శెట్టిబలిజలు రాజ్యాధికారాన్ని శాసించే విధంగా అడుగులు వేయాలన్నారు. అలనాటి నుంచి గంగలకుర్రు అగ్రహారం శాసించే రాజకీయాలకు పేరుగాంచిందన్నారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీసీ సామాజిక వర్గంలో శెట్టిబలిజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. శెట్టిబలిజలంతా ఐక్యంగా సాగాలన్నారు. నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత్‌భూషన్, రెడ్డి నాగేంద్రమణి మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులంతా సేవా కార్యక్రమాల్లో ముందుండాల న్నారు. ఆత్మీయ సమ్మేళన సభ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు దొమ్మేటి వెంకటరెడ్డి, రాయుడు సత్తిబాబు చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాంద్రేగుల శ్రీనివాసరావు, బొంతు పాపయ్య, కుడుపూడి సత్తిబాబు, రాయుడు కృష్ణమహేష్, రాయుడు మీరయ్య, గుత్తుల సాయి, పిల్లి నాగ గోపాలకృష్ణ, వాసంశెట్టి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ జేఏసీ పల్నాడు జిల్లా కార్యవర్గం ఎన్నిక




**నరసరావుపేట ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) పల్నాడు జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రకాష్‌నగర్‌లోని ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా చైర్మన్‌గా మర్లపాటి రామకృష్ణ, కో--చైర్మన్‌లుగా ఎస్.మురారి, కెఎస్‌కె షరీఫ్, బి.సంపత్‌బాబు, ఏ.ఏమండీ, వైస్ చైర్మన్‌లుగా ఎస్.సుబ్బారావు, ఉబేద్ బేగ్, పిఐజే మరియరాజు, ఎం.రామయ్య, జనరల్ సెక్రటరీగా ఎం.మోహనరావు, జాయింట్ సెక్రటరీలుగా కె.ప్రతాప్‌కుమార్, సి.సి.ఆదెయ్య, ఎస్ కొండయ్య, ఏ.ఆంజనేయులు షేక్.కమల్‌బాషా, కె.బ్రహ్మయ్య, కోశాధికారిగా కె.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌జీఓ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని, 30 శాతం డీఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షనర్ల అడిషనల్ క్వాంటం పెంచాలని కోరారు. ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ చేపట్టే కార్యాచరణను విజయవంతం చేస్తామని జిల్లా కమిటీ ప్రకటించింది.

## విద్యార్థినిపై దాడి ఆరోపణలు...

### ప్రిన్సిపాల్ ను అరెస్ట్ చేయాలంటూ తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల డిమాండ్



**పల్నాడు జిల్లా,నరసరావుపేట ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రకాశ్ నగర్‌లోని ఆక్స్ఫర్డ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని భాను బషీరా (ఙ/శీ నగూల్ మీరా)పై ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి తీవ్రంగా కొట్టినట్టు ఆరోపణలు వెలువడ్డాయి. చిన్న విషయానికే ఆగ్రహంతో శారీరకంగా దాడి చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన తర్వాత విద్యార్థిని భయాందోళనకు గురైందని... ప్రిన్సిపాల్ తరచూ విద్యార్థులను ఇలాగే కొడతాడని బాధిత విద్యార్థులు చెబుతున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. వెంటనే ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. విషయం బయటకు రావడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది

## రైతులకు యూరియా పంపిణీ చేస్తాం



**ఒంటిమిట్ట ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఈ రబీ సీజన్లో రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేస్తున్నామని కడప డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు జి.లక్ష్మీ మాధవి తెలిపారు. సోమవారం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం రైతు సేవా కేంద్రాన్ని ఏడీఏ తనిఖీ చేశారు. యూరియా పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ ఈ సీజన్లో యూరియా కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వివరించారు. కర్షకుల అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని, యూరియాను అదనంగా తెప్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మూతపడిన ఒంటిమిట్ట రైతు సేవా కేంద్రాన్ని తెరిపించి, అక్కడికి కూడా యూరియాను తెప్పించాలని అన్నదాతలు వినతిపత్రం అందజేశారు. ఏవోలు మంజుల రాణి, సుమంత్ రెడ్డి, వీహెచ్ఏ నిహారిక పాల్గొన్నారు.

## పెద్దింట్లమ్మ జాతరకు భక్తుల తాకిడి

**కైకలూరు ఫిబ్రవరి 23 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో భక్తులు కిటకిటలాడారు. సమీప జిల్లాల నుంచి వేలాది మంది మొక్కులు సమర్పించుకున్నారు. పెద్దింట్లమ్మకు విశేషార్చన, నూతన వస్త్ర అలంకరణ, పుష్పాలంకరణ, పంచామావరణ కలశార్చన, ద్రవ్యోపచారాలతో అర్చన, ధూపసేవ, బాలభోగం, నీరాజన మంత్ర పుష్పార్చన జరిగింది. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద వితరణ దాతగా విజయవాడకు చెందిన కొయ వేంకటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. జాతరకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదం, మజ్జిగను ఆలయ ధర్మకర్త కొల్లి రాంబాబు అందించారు. భక్తులకు వాటర్ ప్యాకెట్లను విజయవాడకు చెందిన బండారు కృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వాహనాలతో వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మకు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు వంటలు చేసుకోడానికి దేవస్థానం ఉచిత పందిర్లను కేటాయించింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూరెళ్ల లక్ష్మీజ్యోతి బృందం ప్రదర్శించిన కూచిపూడి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఈ నెల 28న జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గాగోకర్ణేశ్వస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. అమ్మవారికి రూ.2,29,565 ఆదాయం వచ్చిందని ఈవో శ్రీనివాసు చెప్పారు.

# వద్దే వద్దంటున్న అజిత్ ఫ్యాన్స్



తమిళ టాప్ స్టార్లలో ఒకడైన అజిత్‌కు వీరం, వేదాళం, విశ్వాసం చిత్రాలతో మరపురాని విజయాలు అందించాడు దర్శకుడు శివ. తమిళంలో ఒకప్పుడు పేరున్న సినిమాటోగ్రాఫర్ అయిన శివ.. తెలుగులో దర్శకుడిగా పరిచయం కావడం విశేషం. గోపీచంద్ హీరోగా శౌర్యం, శంఖం సినిమాలు తీశాడతను. తర్వాత సొంత భాషలో 'విక్రమార్కుడు' సినిమాను 'సిరుత్తై' పేరుతో రీమేక్ చేస్తే అది పెద్ద హిట్టయింది. ఆపై అతను సొంత కథలతో వీరం, వేదాళం, వివేగం, విశ్వాసం సినిమాలు తీశాడు. ఇందులో వివేగం మినహా సినిమాలు బ్లాక్ బస్టర్లు అయ్యాయి. ఐతే అజిత్‌కు మూడు హిట్లు ఇచ్చినా సరే.. తన విషయంలో అజిత్ ఫ్యాన్స్ నుంచి మిశ్రమ స్పందన వస్తుంటుంది. అజిత్‌ను ఒక మూసలోకి తీసుకెళ్లిపోయాడని.. రొటీన్ సినిమాలు తీసి విసిగించాడని అంటుంటారు. ఐతే అజిత్ కాకుండా శివ వేరే హీరోలతో సినిమాలు తీస్తే అస్సలు వర్కవుట్ కాలేదు. సూపర్ స్టార్ రజినీకాంత్‌తో తీసిన 'అన్నాత్తే', సూర్యతో చేసిన 'కంగువ' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. దీంతో శివ పట్ల కోలీవుడ్లో బాగా వ్యతిరేకత వచ్చేసింది. తనతో సినిమా చేయడానికి స్టార్లు ఇప్పుడు భయపడుతున్నారు. ఇలాంటి టైంలో అజిత్ మళ్లీ అతడికి అవకాశమిచ్చినట్లుగా వార్తలు వస్తున్నాయి. వరుస ఫ్లాపుల తర్వాత గత ఏడాది 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో హిట్ ట్రాక్ ఎక్కాడు అజిత్. ఆ సినిమా అభిమానులకు గొప్ప ఊరటనిచ్చింది. ఐతే ఆ సినిమా తీసిన ఆధిక్ రవిచంద్రన్‌తోనే ఇంకో సినిమాను అజిత్ లైన్లో పెట్టాడు. కానీ ఇప్పుడేమో లైనప్ మారిందంటున్నారు. మధ్యలోకి శివ సినిమా వచ్చిందని.. దాన్నే ముందుకు తీసుకెళ్తున్నాడని.. ఆ తర్వాతే ఆధిక్ సినిమా ఉంటుందని అంటున్నారు. కానీ అజిత్ ఫ్యాన్స్ దీని పట్ల నెగెటివ్‌గా స్పందిస్తున్నారు. శివ మళ్లీ రొటీన్ సినిమా తీస్తాడని.. ఫామ్‌లో లేని అతడితో మళ్లీ జట్టు కట్టడం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. లేక లేక ఒక పెద్ద హిట్ ఇచ్చిన ఆధిక్‌ను వదిలేసిన శివతో వెళ్లడాన్ని వాళ్లు అంగీకరించలేకపోతున్నారు. మారుతితో ప్రభాస్ సినిమా చేస్తుంటే ఫ్యాన్స్ వ్యతిరేకించినట్లే.. అజిత్ అభిమానులు కూడా ఇప్పుడు శివ సినిమా విషయంలో నెగెటివ్‌గా స్పందిస్తున్నారు.




## బలవంత్ బిజినెస్ వర్కౌట్ అయ్యిందా



మొన్న శుక్రవారం విడుదలైన సినిమాల్లో ప్రమోషన్ల పరంగా బాగా హడావిడి చేసింది హే బలవంత్ ఒక్కటే. మిగిలినవి కూడా పబ్లిసిటీ చేశాయి కానీ దీని మీద వచ్చిన అటెన్షన్ వేరేవాటికి రాలేదన్నది వాస్తవం. అయితే ఫోకస్ బాగానే పడింది కానీ బాక్సాఫీస్ దగ్గర బలవంత్ సౌండ్ ఏమంత బిగ్గరగా లేదు. నిన్న ఆదివారం అయినప్పటికీ చాలా చోట్ల ఆక్యుపెన్సీలు సగం కంటే తక్కువ స్థాయిలో ఉన్నాయి. సాయంత్రం క్రికెట్ మ్యాచ్ ప్రభావం కొంత ఉందనుకున్నా.. ఉదయం, మధ్యాన్నం షోలలో కూడా మేజిక్ జరగలేదు. హైదరాబాద్ లాంటి నగరాల్లో జనాలు కనిపించగా బిసి సెంటర్స్ లో మాత్రం బలవంత్ ఎదురీదుతున్న వైనం స్పష్టం. ముఖ్యంగా బిజినెస్ బిజినెస్ అంటూ టీమ్ తెగ ఊదరగొట్టిన పాయింటే ఫ్యామిలీ ఆడియన్స్ ని దూరం చేసినట్టుగా కనిపిస్తోంది. దర్శక నిర్మాతలకు అది క్రియేటివ్ గా అనిపించి ఉండొచ్చు కానీ నరేష్ తో చేయించిన వ్యాపారం ఏదైతే ఉందో అది కుటుంబాలు అంగీకరించేది కాదు. దానికి జస్టిఫికేషన్, ఎమోషన్స్ తగినంత జోడించినా అవి పూర్తి కన్విన్సింగ్ గా లేకపోగా సదరు బిజినెస్ ని సమర్థించుకునేందుకు పడిన ప్రయాస ప్రభావం చూపించింది. ట్రేడ్ టాక్ ప్రకారం వీకెండ్ వరకు హే బలవంత్ వరల్డ్ వైడ్ గ్రాస్ అయిదు కోట్లు దాటిందట. ఇలా అయితే బ్రేక్ ఈవెన్ ఇంకా దూరంలో ఉన్నట్టే ఈ శుక్రవారం విష్ణు విన్యాసం రిలీజవుతున్న నేపథ్యంలో హే బలవంత్ వీక్ డేస్ లో ఏం చేస్తుందనేది చూడాలి. బాక్సాఫీస్ తత్వం బోధ పడిందో ఏమో ప్రస్తుతానికి టీమ్ అయితే ప్రచారాన్ని ఆపేసింది. నిర్మాత చెప్పిన ప్రకారం ఓవర్సీస్ లో వన్ మిలియన్ దాటాలి కానీ ప్రస్తుతం సగానికే పోరాడుతున్న వైనం స్పష్టం. అన్ని వర్గాలను మెప్పించే యునానిమాస్ టాక్ వస్తే వేరుగా ఉండేది కానీ ఇలాంటి రెస్పాన్స్ తోనే కొంచెం సమస్య ఉంటుంది. సుహాస్ కోణంలో చూస్తే గ్రాస్ పరంగా తనకిది పెద్ద నెంబర్ అవుతుందా లేదా అనేది వచ్చే వీకెండ్ తో తేలిపోతుంది. రాబోయే రెండు వారాలు శ్రీవిష్ణు డామినేషన్ ఉండటం ఖాయం.

# జననాగయన్... విజయ్ కీలక నిర్ణయం?

అంతా అనుకున్న ప్రకారం జరిగి ఉంటే.. తమిళ టాప్ స్టార్ విజయ్ చివరి చిత్రం 'జననాగయన్' విడుదలై ఆరు వారాలు దాటిపోయి ఉండాలి. కానీ జనవరి 9న సంక్రాంతి కానుకగా రావాల్సిన సినిమా.. సెన్సార్ సమస్యల వల్ల అనూహ్యంగా వాయిదా పడిపోయింది. వాయిదా అంటే రెండు మూడు రోజులే అని ముందు అనుకున్నారు. కానీ వారాలు గడిచినా ఆ సినిమా విడుదల కాలేదు. ఇంకో రెండు నెలల్లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి చిత్ర బృందం విశ్వ ప్రయత్నం చేసింది. కానీ కుదరలేదు. ఈ నెలలో రిలీజ్ లేదంటే.. ఇక ఎన్నికలయ్యే వరకు సినిమా రాదని ఫిక్సయిపోవాల్సిందే. త్వరలో తమిళనాట ఎన్నికల కోడ్ రాబోతోంది. ఆ టైంలో ఇలాంటి పొలిటికల్ టచ్ ఉన్న సినిమాను రిలీజ్ చేయడం మరింత కష్టమవుతుంది. కాబట్టి అందరూ ఎన్నికల తర్వాతే ఈ సినిమా వస్తుందని ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఏప్రిల్ మధ్యలో ఎన్నికలు జరగనున్నాయి. కాబట్టి వెంటనే ఆ నెల చివర్లో సినిమా రిలీజవుతుందేమో అనుకున్నారు ఫ్యాన్స్. కానీ తాజా సమాచారం ప్రకారం ఎన్నికలు అయిన వెంటనే కూడా సినిమా విడుదల కాబోదట. ఫలితాలు కూడా వచ్చాక, జూన్‌లో మంచి ముహూర్తానికి సినిమా విడుదల కానున్నట్లు తాజా సమాచారం. జూన్ 22న విజయ్ పుట్టిన రోజుకే 'జననాయగన్'ను రిలీజ్ చేయడానికి టీం ఒక నిర్ణయానికి వచ్చిందట. ఎన్నికల కోసం ఈ సినిమాను ఉపయోగించుకోవాలన్న విజయ్ కోరిక ఫలించలేదు. కాబట్టి ఎన్నికలు అయ్యాక ఎప్పుడు రిలీజైనా ఇబ్బంది లేదు. ఐతే ఫలితాలు వచ్చాయంటే అప్పుడు విజయ్ పవర్ ఫుల్ పొజిషన్లో ఉంటాడనే ఒక అంచనా ఉంది. ప్రభుత్వ ఏర్పాటులో కింగ్ మేకర్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. అప్పుడు 'జననాయగన్'కు సెన్సార్ లేదా ఇంకే విధంగానూ అడ్డంకులు ఉండకపోవచ్చు. అంతకంటే ముందు రిలీజ్ చేస్తే మాత్రం చాలా సీన్లు, డైలాగులకు కత్తెర వేయాల్సి రావచ్చు. కాబట్టి ఆ అవకాశం ఇవ్వకుండా.. ఎన్నికల ఫలితాలు వచ్చాక, ఫ్యాన్స్ బాగా సెలబ్రేట్ చేసుకునే రోజైన జూన్ 22నే ఆ సినిమాను రిలీజ్ చేయడానికి విజయ్ అండ్ కో ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.





# బిజినెస్ న్యూస్



## లాభాలతో ముగిసిన సూచీలు.. 25,700 ఎగువకు నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ట్రంప్ వివిధ దేశాలపై విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా ప్రపంచ మార్కెట్లతో పాటు మన సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 82,906.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,814.71) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 83,486.15 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 479.95 పాయింట్ల లాభంతో 83,294.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.75 పాయింట్ల లాభంతో 25,713 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. క్వాలిటీ వాల్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5147 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## సుప్రీం తీర్పు ఎఫెక్ట్.. రేపటి నుంచి ట్రంప్ టారిఫ్‌లు బంద్



ప్రపంచదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన టారిఫ్‌లు చెల్లవని అగ్రరాజ్య సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తీర్పునకు అనుగుణంగా అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు చెల్లవని చెప్పిన టారిఫ్ లను మంగళవారం నుంచి వసూలు చేయబోమని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ప్రకటించింది. 'అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ) కింద ట్రంప్ విధించిన టారిఫ్‌ల వసూళ్లను.. అమెరికా కాలమానం ప్రకారం ఫిబ్రవరి 24వ తేదీ నుంచి నిలిపివేయనున్నట్లు పేర్కొంది. ఇదే సమాచారాన్ని ఇప్పటికే దిగుమతిదారులకు అందజేసినట్లు తెలిపింది. అయితే, ఇప్పటివరకు దిగుమతిదారులు చెల్లించిన టారిఫ్‌లను రిఫండ్ చేస్తారా? లేదా? అన్నదానిపై కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పష్టతనివ్వలేదు. ఈ టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా (ఖూూ) సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన మూడు రోజుల తర్వాత నిలిపివేతపై ప్రకటన వెలువడటం గమనార్హం. అధ్యక్షుడి అత్యవసర అధికారాల చట్టాన్ని వినియోగిస్తూ ప్రతీకార సుంకాలు విధించడాన్ని తప్పుబట్టిన అగ్రరాజ్య అత్యున్నత న్యాయస్థానం.. ఆ టారిఫ్‌లను రద్దు చేస్తూ ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించింది. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గలేదు. ప్రపంచదేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు మళ్లీ ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు ఫిబ్రవరి 24వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని చెప్పినప్పటికీ.. ఇందుకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు ఇంకా జారీ కాలేదు. దీంతో కొత్త టారిఫ్‌లు రేపటి నుంచే వర్తిస్తాయా? లేదా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా.. ఈ పరిణామాలతో భారత్‌పై సుంకాలు 50శాతం నుంచి 15 శాతానికి దిగొచ్చాయి.

## భారీగా పతనమైన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు



ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు సోమవారం నాటి ట్రేడింగ్ ఆరంభం నుంచి భారీగా పతనం అవుతున్నాయి. ఒకానొక దశలో దాదాపు 20%శాతం పతనమయ్యాయి. ఆ తర్వాత కొద్దిగా కోలుకొన్నా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. తమ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచిలో రూ.590 కోట్ల మేరకు కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. గవర్నమెంట్ ఖాతాల నిర్వహణలో ఈ మోసం జరిగినట్లు భావిస్తున్నారు. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన తీవ్రమైంది. దీంతో నేడు ట్రేడింగ్ మొదలైన వెంటనే ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇక ఉదయం 11.08 సమయంలో 15.28శాతం నష్టంతో రూ.70.75 వద్ద ట్రేడవుతున్నాయి. హరియాణా ప్రభుత్వ విభాగం ఒకటి ఈ బ్యాంకులో తమ ఖాతాను క్లోజ్ చేసి నిధులను బదిలీచేయమని కోరగా ఈ కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు విభాగ పుస్తకాల్లో నగదు.. బ్యాంక్‌ఖాతాలో మొత్తానికి సరిపోలకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. దీంతో హరియాణా ప్రభుత్వంలోని పలు శాఖలు తమ ఖాతాలను సరిచూసుకోవడం మొదలుపెట్టాయి. అయితే చండీగఢ్ శాఖలోని ఖాతాల్లోనే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

## అత్యధిక బొగ్గు ఉత్పత్తి గనిగా గెవ్రా



కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లో కోల్ ఇండియాకు చెందిన గెవ్రా గని, వచ్చే ఏడాది 63 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడం ద్వారా, ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే గనిగా అవతరిస్తుందని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) సీఎండీ హరీశ్ దుహాన్ వెల్లడించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్ఈసీఎల్ నిర్వహిస్తున్న గెవ్రా గని, మన దేశంలో అతి పెద్ద ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని. 1981 నుంచి ఈ గనిలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ ఏడాది 56 మి.టన్నుల బొగ్గు ఇక్కడ వెలికి తీయనున్నారు. ఈ గని సామర్థ్యాన్ని సంవత్సరానికి 70 మి.టన్నులకు విస్తరించడానికి ఇప్పటికే పర్యావరణ అనుమతి లభించింది కూడా. వచ్చే ఏడాదిలో గెవ్రా గని 63 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, ప్రపంచంలోనే నంబర్ వన్ గనిగా మారుతుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు. అమెరికా (వయామింగ్)లోని పౌడర్ రివర్ బేసిన్‌లో ఉన్న బ్లాక్ థండర్ గని 61-62 మి.టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు గనిగా ఉంది. దీని తర్వాత నార్త్ యాంటెలోప్ రోషెల్ గని ఉంది. గెవ్రా గని ప్రతిష్ఠాత్మక లక్ష్యానికి అవసరమైన 4 ముఖ్యమైన వనరులు - భూమి, యంత్రాలు, మానవ వనరులు, బొగ్గు స్వీకరించే వినియోగదార్ల గిరాకీ అని వివరించారు. కచ్చితమైన ముందస్తు ప్రణాళికతో, అవసరమైన అన్ని వనరులను తమ బృందం కలిగి ఉందని హరీశ్ పేర్కొన్నారు. తగినంత భూమి, అవసరమైన అన్ని పరికరాలు, బొగ్గు సరఫరా కాంట్రాక్టులు, వినియోగదార్ల నుంచి బొగ్గుకు గిరాకీ కూడా బలంగా ఉందని వెల్లడించారు. భారతీయ రైల్వేల మద్దతుతో బలమైన మౌలిక సదుపాయాలు బొగ్గు తరలింపునకు సహాయపడతాయని తెలిపారు. ఎస్ఈసీఎల్‌లోనే 700 మెగావాట్ల సౌర ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తోందని సీఎండీ తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఖనిజాల్లో కొన్ని ప్రాజెక్టులను చేయడానికి కూడా జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు వివరించారు. '2026-27లో గెవ్రా గని నుంచి ఉత్పత్తిని 63 మి.టన్నులకు పెంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది ప్రస్తుతం 62 మి.టన్నులు ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలోనే అతి పెద్దదైన అమెరికాలోని బ్లాక్ థండర్ గనిని అధిగమిస్తుంద'ని ఎస్ఈసీఎల్ ఏరియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ త్యాగి కూడా పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డి



**చీపురుపల్లి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీలో పైలపేట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడానికి రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. అనంతరం కలెక్టర్ పైలపేట గ్రామంలోని పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్, చీపురుపల్లి ఆర్డీవో ప్రమీల గాంధీ, డీఎస్పీ ఎన్ రాఘవులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## భీమిలి జోనల్ కమిషనర్ గా విజయ్ కుమార్



**భీమునిపట్నం ఫిబ్రవరి 23 నేటి మనదేశమ్ :** జోన్ 1 కమిషనర్ గా మేకల విజయ్ కుమార్ సోమ వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నూతన కమి షనర్ కు సహచర సిబ్బంది ఘనంగా స్వాగ తం పలికారు. విజయ నగరం జిల్లా ఎస్ కోట, విశాఖ జిల్లా పాడేరు మండలాలలో ఎంపీడీవో గా విధులు నిర్వర్తించారు. పాడేరు నుండి ఎన్నికలవేళ జిల్లా పరిషత్ కు తాత్కాలిక బదిలీపై ఎఓగా వెళ్లారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ జిల్లా కోఆర్డినేటర్, ఇంచార్జ్ డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2022 సంవత్సరంలో జడ్పీ సీఈఓ గా జిల్లాల పునర్విభజన సమయంలో విధులు నిర్వర్తించారు. అక్కడనుండి పద్మనాభం ఎంపీడీవో గా పనిచేసి ఎన్నికల సమయంలో కాకినాడ జిల్లా శంఖవరం ఎంపీడీవో గా బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం పద్మనాభం ఎంపీడీవో గా పనిచేస్తున్న సమయంలో 2025 సెప్టెంబర్ లో డిడిఓ గా పదోన్నతి పొంది వైఎస్ఆర్ జిల్లా ప్రస్తుత పోలవరం జిల్లా చింతూరు కు బదిలీపై వెళ్లారు. సుమారు అయిదు నెలల అనంతరం విశాఖ జిల్లా భీమునిపట్నం జోన్ వన్ కార్యాలయం కమిషనర్ గా బదిలీపై వచ్చారు. .

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**గతంలోనే అసెంబ్లీలో తీర్మానం: మంత్రి పార్థసారథి**



**నూజివీడు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించాలని ఏలూరు జిల్లా రజక మహాసభ విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన జిల్లా రజక ఆత్మీయ మహాసభలో పాల్గొన్న రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఈ మేరకు విన్నవించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ టీడీపీకి బీసీలతో ఉన్న అనుబంధం ఎవరూ విడదీయలేదని పేర్కొంటూ.. గతంలోనే టీడీపీ హయాంలో.. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు గుర్తుచేశారు. జగన్ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరగగా కూటమి పాలనలో బీసీలకు జరుగుతున్న మేళ్లను బీసీ వర్గాలు గమనించాలన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షిస్తోందని, దీని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. అయితే, విధ్వంసం తప్ప అభివృద్ధి చేయడం చేతకాని జగన్ ఈ ఫలాలు మనకు దక్కనీయకుండా గోబెల్స్ ప్రచారాలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించి కూటమి ప్రభుత్వానికి భవిష్యత్‌లో కూడా అండగా ఉండాలని మంత్రి కోరారు.

## అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



**ఆదోని :** ఏపీలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సోమవారం అసెంబ్లీలో మాట్లాడారు. కోవిడ్ బాధితులకు సహాయం కోసం ఈశ్రమ్ పోర్టల్‌ను అమల్లోకి తీసుకొస్తే, గత వైకాపా ప్రభుత్వంలో చాలా తక్కువ మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే 18 లక్షల మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకోవడం హర్షించదగిన విషయమన్నారు. గత వైకాపా పాలనలో విశ్వకర్మ యోజన జీవనజ్యోతి అటల్ పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు సైతం కార్మికులకు అందలేదన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.25 లక్షలు వైద్య సేవలు, ఎక్కడైనా రేషన్ తీసుకునే అంశంపై మంత్రి స్పందించాలని కోరారు.

# దేశ సంస్కృతి, సంప్రదాయాలు అంతరించే ప్రమాదం

**– మఠాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలే గాడిలో పెట్టాలి**
**– కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి**



**మంత్రాలయం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** దేశంలో సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాలు అంతరించే ముప్పు ఉందని.., పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక కేంద్రాలే గాడిలో పెట్టాలని కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. కర్నూలు జిల్లా మంత్రాల యంలో ఆదివారం గురువైభవోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన యోగీంద్ర కళా మండపంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో చాలామంది కుటుంబ బాంధ వ్యాలకు దూరంగా ఉంటున్నారని గుర్తు చేశారు.

భార్యా భర్తలు, తల్లిదండ్రులు, కొడుకులు, కూతుళ్ల మధ్య అవగాహన లోపం, గౌరవం, భయం, భక్తి లేపోవడంతో మనభారత సంస్కృతికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు కుమారస్వామి రాఘవేంద్ర స్వామిని దర్శించి, మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

## తోలుబొమ్మలాట కళాకారులను ఆదుకోవాలి : అనిల్ కుమార్



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** తోలు బొమ్మలాట కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబివికెలో ఆంధ్రప్రదేశ్ తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోలుబొమ్మలాట కళాకారులకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని, నెలకు రూ.10 వేలు పింఛను చెల్లించాలని కోరారు.జానపద కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీర్నాల కృష్ణ మాట్లాడుతూ.. తోలుబొమ్మలాట కళాకారుల పిల్లలకు వృత్తిపరమైన శిక్షణ శిబిరాలను నిర్వహించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సబ్సిడీపై అందించాలని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అనపర్తి ఏడుకొండలు వెల్లడిస్తూ.. తోలుబొమ్మలాట కులస్తులను బిసి(ఎ) జాబితాలో చేర్చాలని కోరారు. దేవాదాయ ధర్మాదాయ, వైద్యారోగ్యశాఖలో నిర్వహించే కళారూపాలను ప్రదర్శించేందుకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తోలుబొమ్మలాట కళాకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టాల పంపిణీ



**గోపాలపట్నం :** పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం పరిధిలో ఒక సెంటు భూమి లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ గణబాబు పట్టాలను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి పురోగతి లేకుండా టిడ్కో ఇళ్లను, ఒక సెంట్ భూమిని లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని తెలిపారు. త్వరలో టిడ్కో ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు జరుపుకుంటారని చెప్పారు. ఒక సెంటు భూమికి పట్టాలు పొందిన లబ్ధిదారులు గణబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఎపిడిఓ చిరంజీవి, కూటమి నాయకులు నారిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్, కంపర ఆనంద్, బంగారు తులసిరామ్, శరగడం అరుణ్, నాగులపల్లి లతకుమార్, కనకకుమార్, పట్నాల అరుణ్ కుమార్, దాడి సురేష్, పిడుగు మంగలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మ రక్షణ కు మార్షల్ ఆర్ట్స్ ఒక ఆయుధం
### డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్



**భీమునిపట్నం ఫిబ్రవరి 23 నేటి మనదేశమ్ :** తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాల లో జె.యన్.టు.యు.జి.వి. యూనివర్సిటీ పరిదిలో ఉన్న ఆరు జిల్లాల ఇంటర్, ఇంజినీరింగ్ కళాశాల ల బాలుర బాలికల కరాటే,బాలికల టైక్వాండో సెలక్షన్ ట్రైల్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిలు గా అవంతి కళాశాల డైరెక్టర్ డా.ఎ.చంద్ర శేఖర్, ప్రిన్సిపాల్ మురళీ కృష్ణ లు హాజరయ్యారు.అనంతరం కరాటే,టైక్వాండో సెలక్షన్ ట్రైల్స్ ను ప్రారంభించారు.ఈ ట్రైల్స్ లో తొమ్మిది కళాశాల ల నుంచి కరాటీ తరుపున 27 మంది, టైక్వాండో తరుపున 11 మంది పాల్గొన్నారు. ఆసక్తికరంగా సాగిన పోటీలను వీక్షకులు ఆశక్తి తో తిలకించారు.ఈ ట్రైల్స్ కి కరాటీ విభాగం నుంచి వి.యన్.డి ప్రవీణ్, మూర్తి, అప్పారావు,రెమో యాదవ్ లు, తైక్వాండో విభాగం నుంచి వేణు గోపాల్ రావు, సురేష్,న్యాయ నిర్ణేతలు గా వ్యవహరించారు. అవంతి కశాశాల డైరెక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఈరోజుల్లో మహిళలు పై అఘాయిత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయి.వీటిని ప్రతి ఘటించడం లో కరాటే, టైక్వాండో లాంటి విద్యలు ఎంతో ప్రాముఖ్యత సంతరించు కుంటాయి అని అన్నారు.మహిళలకు ఇలాంటి పోరాట పటిమ గల విద్య సమాజం లో ఒక ఆయుధం గా ఉపయోగ పడతాయని ఉద్ఘాటించారు. ప్రిన్సిపాల్ మురళి కృష్ణ మాట్లాడుతూ చదువులు తో పాటు విద్యార్థులకు ఆత్మ రక్షణకు దోహదపడే ఇటువంటివి ఈవెంట్స్ అవంతి కళాశాల తరుపున నిర్వహించి విద్యార్థులు లో ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీయాలనే ఆలోచన అని అన్నారు.కరాటే,టైక్వాండో లను ఎక్కడ పడితే అక్కడ ప్రదర్శించి జీవితాలను నాశనం చేసుకునే విధంగా కాకుండా,ఒక ఆత్మ రక్షణ విద్య లా చూడాలని సూచించారు.ఈ ట్రైల్స్ లో ఎన్నికైన వారిలో టైక్వాండో నుంచి బాలికలు మార్చి 16 నుంచి 20 వరుకూ ఒరిస్సా రాష్ట్రంలో ఫకీర్ మోహన్ యూనివర్సిటీ లో జరుగు అఖిల భారత అంతర విశ్వ విద్యాలయం లో అలాగే మార్చి 17 నుంచి 21 వరుకూ జరగబోయే కరాటీ పోటీ లలో నుంచి బాలురు బాలికలు మద్య ప్రదేశ్ రాష్ట్రంలో గల భోపాల్ లో ఉన్న సాగి యూనివర్సిటీ లో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎడ్మిన్ డైరెక్టర్ విశ్వ ప్రసాద్,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాగ పూర్ణశ్రీ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ రాము, పర్యవేక్షకులు మహేష్,సీనియర్ పిజికల్ డైరెక్టర్ కోలా చంద్ర శేఖర్,పిడి లు మద్దిల శంకర్,పైలా గాయిత్రి,జి.ప్రకాశమ్మ తథితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంకు 1 అర్జీ

**భీమునిపట్నం: ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంకు1 అర్జీ వచ్చిందని జోనల్ కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 01తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందిని తెలిపారు.

## చంద్రబాబు, జగన్ వ్యాఖ్యలు అర్థరహితం

**– ఎపిసిసి అధ్యక్షులు షర్మిల**



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** బాధ్యత గురించి చంద్రబాబు, రాజకీయ ఐక్యత గురిచి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. అస్తవ్యస్త సదస్సుతో 70 దేశాల ముందు దేశ ప్రతిష్టను దిగజార్చితే సిగ్గుపడాలని ఎందుకు అనిపించలేదని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దేశ రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి, ట్రంప్ ఎదుట సాగిలపడ్డప్పుడే దేశ పరువు పోయిందన్నారు. అమెరికా ప్రయోజనం కోసం సున్నా సుంకాలకు ఒప్పుకున్నప్పుడే దేశ ప్రతిష్ట దిగజారిందని తెలిపారు. అగ్రరాజ్యంతో జరిగింది బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమని చెప్పే ప్రయత్నమే యువజన కాంగ్రెస్ చేసిందన్నారు. చంద్రబాబు, జగన్‌కు ఇది అర్థం కాకపోవడం వారి అవివేకమన్నారు.

## ఈ-గవర్నెన్స్‌పై ఏపీ సహకారం తీసుకుంటాం

**– అధ్యయనానికి రాష్ట్రానికి బృందాన్ని పంపిస్తాం**
**– బాపట్ల కలెక్టర్‌తో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్**



**బాపట్ల, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** ఈ-గవర్నెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకుంటున్న తీరు అద్భుతమని, ఈ విషయంలో ఏపీ ప్రభుత్వ సహకారం తీసుకోవడంతో పాటు అధ్యయనం కోసం త్వరలోనే ఓ అధికారిక బృందాన్ని పంపిస్తామని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్ తెలిపారు. టూరిజం పాలసీ కసరత్తులో భాగంగా గోవా పర్యటనలో ఉన్న బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సారథ్యంలోని బృందం గోవా ముఖ్యమంత్రిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తమ పర్యటనకు సహకరించినందుకు ఏపీ ప్రభుత్వం తరపున కలెక్టర్ గోవా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకంపై ఏపీ ప్రభుత్వం రూపొందించిన కాఫీటేబుల్ బుక్‌ను అందజేశారు. ఆతిథ్య రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని గోవా సీఎం అభినందించారు. టూరిజం పాలసీలకు సంబంధించి పలు కీలక సూచనలను అందించారు. తీర ప్రాంతంలో సీఆర్‌జడ్ నిబంధనల అమలు విషయంలో పక్కాగా వ్యవహరించాలని, లేకుంటే భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందని సీఎం కలెక్టర్‌కు సూచించారు. గోవా ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా కలెక్టర్ అందించారు.

## ధ్యాన బుద్ధుడిని సందర్శించిన ఒడిశా యువత



**అమరావతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్) :** ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో కేంద్ర యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో శనివారం నుంచి నిర్వహిస్తున్న అంతరాష్ట్రీయ యువ మార్పిడి సమ్మేళన కార్యక్రమానికి ఒడిశాలోని సంబల్పూర్, బార్గర్గ్, కలహంది, బోలాన్గిర్, బాలాసోర్ జిల్లాల నుంచి 37 మంది యువతి, యువకులు హాజరయ్యారు. వీరంతా ఆదివారం అమరావతిలో ధ్యాన బుద్ధుడిని, అమరలింగేశ్వర స్వామి ఆల యం, అమరావతి మ్యూజియం, ఉండవల్లి గుహలను సందర్శిం చారు. గుంటూరు మై భారత్ కేంద్ర జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ అంతర్రాష్ట్ర యువతమధ్య జాతీయ ఐక్యత సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. చారిత్రక, పర్యాటక పరంగా ప్రసిద్ధిగాంచిన అమరావతిని సందర్శించేందుకు ఒడిశా యువతకు అవకాశం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జన చైతన్య సమితి కార్యాలయాన్ని ఒడిశా యువత సందర్శించి సంస్థ కార్యకలా పాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం మాస్టర్ తుళ్ళూరి సాంబశివరావు నేతృత్వంలో పొందుగల మురళి కృష్ణ కోలాట బృందం కోలాటాన్ని ప్రదర్శించారు. జనచైతన్య సమితి వ్యవస్థాపకులు దాసరి విజరు బన్నీబాబు, వేలితోటి అనిల్ కుమార్,జయరావు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "మీ కోసం"

## – అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు.





**మచిలీపట్నం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రభుత్వ సత్సంకల్పానికి అనుగుణంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎవరైనా వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు అన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అడిషనల్ ఎస్పీ వారితో నేరుగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం పూర్తిస్థాయి విచారణ జరిపి, సత్వర పరిష్కారం అందజేస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదులో గల సమస్య తీవ్రత ఆధారంగా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి సత్వర పరిష్కారం అందించాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు మరియు ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు.

# ఆలయంలోని హుండీలు తెరిచి.. నగదు పంచుకొని..



**గోపవరం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గోపవరం మండలం మల్లెంకొండలో ఈనెల 15న జరిగిన శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎంతో నమ్మకంతో దేవుడికి సమర్పించిన సొమ్మును స్థానిక నాయకులు మింగేశారు. దేవదాయ శాఖ కింద ఉన్న ఏ దేవాలయంలోనైనా ఆలయ ఈవో ఆధ్వర్యంలోనే హుండీలను తెరిచి లెక్కింపు చేపట్ట?ల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఇందుకు విరుద్ధంగా జరిగింది. ఆలయ కమిటీ, ఈవో అనుమతి లేకుండానే పలువురు వచ్చి ఆలయంలోని హుండీలను తెరిచి డబ్బులను పంచుకున్నారు. ఈ విషయంపై 'న్యూస్ టుడే' ప్రతినిధి ఆలయ ఈవో రామలింగారెడ్డిని వివరణ కోరగా.. అదేం పెద్ద విషయం కాదన్నట్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్ కొండయ్య సైతం అదే తరహాలో జవాబు చెప్పారు. ఆలయాన్ని పరిరక్షించాల్సిన అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 28 నుంచి అనంతవరం శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



**గుంటూరు ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4వ తేదీ వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 24వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఫిబ్రవరి 28న సాయంత్రం 6 గంటలకు భగవతారాధన, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్యంగ్రహణం, అంకురార్పణం, గరుడ అధివాసం, నివేదన, బలిహరణ, మంగళ శాసనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. మార్చి 1న ధ్వజారోహణం ఉంటుంది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వాహన సేవల ముందు ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# అహోబిలంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పరిశీలించారు. ఎగువ, దిగువ ఆలయాల్లో పార్కింగ్ స్థలాలు కల్యాణ వేదికలను పరిశీలించి పోలీసు బందోబస్తు నిర్వహణపై డీఎస్పీ ప్రమోద్‌తో చర్చించారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని నిఘా ఉంచాలని, పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ రమణ, ఎస్సై వరప్రసాద్, ఆలయ ఏవో రామానుజన్ ఉన్నారు.

# ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు



**మచిలీపట్నం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. కృష్ణా జిల్లా ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నాయి. జిల్లాలో 24 వేల 173 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. ద్వితీయ సంవ త్సరం విద్యార్థులు 25,406 మంది పరీక్షకు హాజరవ్వనున్నారని తెలిపారు. జిల్లాను 14 జోన్లుగా విభజించి 63 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 63 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 63 మంది డిపా ర్ట్మెంటల్ అధికారులు, 1,100 మంది ఇన్విజి లేటర్లు విధులు దశలవారీగా విధులు నిర్వహించారు. అదనంగా నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ అధికారి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. కొంతమంది విద్యార్థులు చివరి క్షణంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ట్రాఫిక్ లో చిక్కుకొని చివరి క్షణాల్లో పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్ష కేంద్రాల వద్ద దించి పరీక్ష బాగా రాయాలని ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హాల్ టికెట్ నెంబర్లను పరిశీలించి తమకు కేటాయించిన గదులలో పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144, 163 సెక్షన్లు అమలు చేశారు.

# పరీక్ష ప్యాడ్‌ను కూడా అనుమతించకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి.

**మచిలీపట్నం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల రద్దీ కనిపించింది. టెన్షన్... ఎగ్జైట్‌మెంట్... ఆశలు... లక్ష్యాలు -- అన్నీ కలిసిన వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 10,57,312 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా 1,537 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కృష్ణాజిల్లాలో మొత్తం 49,579 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ప్రథమ సంవత్సరం: 24,173 మంది, ద్వితీయ సంవత్సరం: 25,206 మంది వారి కోసం జిల్లాలో మొత్తం 63 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు, కఠిన నిబంధనలు అమల్లో ఉన్నాయి.

**ఒక్క నిమిషం ఆలస్యం... నో ఎంట్రీ!**

పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు అనే కఠిన నిబంధన అమల్లో ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కనిపిస్తోంది. చాలా మంది తల్లిదండ్రులు ముందుగానే కేంద్రాలకు చేరుకుని బయటే వేచి ఉండడం గమనార్హం.

**మొబైల్, స్మార్ట్‌వాచ్‌లకు నో!**


పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు పూర్తిగా నిషేధించారు. అయితే పరీక్ష ప్యాడ్‌ను కూడా అనుమతించకపోవడంపై కొంతమంది తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి. పరీక్షకు హాజరైన విద్యార్థులకు పోలీస్ శాఖ శక్తి టీం మంచి వాతావరణంలో పరీక్షలు రాయాలి అని చెబుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# రాజమహేంద్రవరం చౌడేశ్వరి నగర్ ప్రాంతంలో ఇంటింటా సర్వే: జిల్లా కలెక్టర్



**రాజమహేంద్రవరం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలోని లాలాపేట చెరువు చౌడేశ్వరి నగర్ ప్రాంతంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆసుపత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తరఫున చేపట్టిన చర్యలను వివరించారు. కల్తీ పాలతో అస్వస్థతకు గురైనట్లు ఆరోపణలు వచ్చినందున పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. పాలు పోసిన వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. "వ్యాపారి 46 మంది రైతుల వద్ద పాలు సేకరించి 106 కుటుంబాలకు పోశాడు. ఆదివారం రాత్రి నుంచి ఇప్పటి వరకు 73 మంది నుంచి రక్తనమూనాలను సేకరించాం. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపించాం. ఫలితాలు సాయంత్రానికి వస్తాయి. అస్వస్థతకు గురైన వారిలో ఇప్పటి వరకు నలుగురు మృతిచెందారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే.. కాల్ సెంటర్‌కి (94940 60060)ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు" అని కలెక్టర్ సూచించారు.

# హంస వాహనంపై విహరించిన జ్వాలా నరసింహస్వామి



**ఆళ్లగడ్డ (గ్రామీణం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవి క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి హంస వాహనంపై విహరించారు. దిగువ అహోబిలంలో బ్రహ్మ ముహూర్తంలో ధ్వజారోహణం చేశారు. గరుత్మంతుని చిత్రపటాన్ని ఆవిష్కరించి ఉత్సవాలు సజావుగా సాగాలని వేడుకున్నారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పల్లకిపై కొలువుంచి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం సకల దేవతలను ఆహ్వానించేందుకు బేరి పూజ నిర్వహించనున్నారు. పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

# ప్రపంచ శాంతి కోసం అక్షరాకృతిలో విద్యార్థులు



**తెనాలి ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శాంతి నిర్మాణం, సంఘర్షణ నివారణ మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా తెనాలి మారీసుపేటలోని నల్లమోతు చెంచురామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం మానవ శాంతి చిహ్నం ఆకృతి (లోగో), పీస్ (ారాజూాజజు) ఆంగ్ల అక్షరాల్లో ఒదిగి తమ వంతు పిలుపు ఇచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# బ్రాహ్మణ సమాజాన్ని అవమానించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...... పి వి ఫణి కుమార్



**మచిలీపట్నం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బ్రాహ్మణ సమాజాన్ని అవమానిస్తూ, వర్గ విద్వేషాన్ని ప్రేరేపిస్తూ, అబద్ధపు , మోసపూరిత వ్యాఖ్యలు చేసిన దేవాదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మచిలీపట్నం నందుగల చిలకలపూడి పోలీస్ స్టేషన్ నందు సోమవారం ఫిర్యాదు చేసి, పి. వి. ఫణి కుమార్ మీడియాతో మాట్లాడారు. దేవాదాయ శాఖ మాజీ సలహాదారుడు జ్వాలాపురపు శ్రీకాంత్ తన ప్రసంగంలో బ్రాహ్మణ సమాజాన్ని లక్ష్యంగా అబద్ధపు, మోసపూరిత వ్యాఖ్యలు చేసిన విషయంపై సోషల్ మీడియాలో, మీడియాలో వచ్చిన కథనాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిలకలపూడి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. జ్వాలాపురపు శ్రీకాంత్ పాలిచ్చే ఆవు, తన్నే దున్నపోతు వంటి పోలికలతో ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశంతోనే వ్యాఖ్యలు చేశారు అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కె.బుచ్చి రాంప్రసాద్ రాష్ట్రంలోని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ గా బ్రాహ్మణులకు పెద్దగా వ్యవహరిస్తున్న ఆయనను అవమానిస్తూ మీరు బ్రాహ్మణ పుట్టుక పుట్టారా అంటూ జ్వాలాపురపు శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని చాలామంది బ్రాహ్మణులు ఆవేదన చెందుతున్నారు అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ పెద్ద అయిన కె. బుచ్చి రాంప్రసాద్ ను ఈ విధంగా మాట్లాడడం చూస్తే ఎంతో బాధ అని పిస్తోంది అన్నారు. జ్వాలాపురపు శ్రీకాంత్ బ్రాహ్మణ సమాజం మరియు కార్పొరేషన్ కార్యకలాపాలపై ఆధారాలు లేని అబద్ధపు ఆరోపణలు చేసి, వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు అన్నారు. అసత్యాలు మాట్లాడి ప్రజల్లో అపోహలు సృష్టించడం ద్వారా సామాజిక ఉద్రిక్తతలు రేకెత్తించే కుట్రలో భాగంగా జ్వాలాపురపు శ్రీకాంత్ వ్యవహరించారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు పోలీసు వారు తీసుకోవాలని కోరుతూ చిలకలపూడి పోలీస్ స్టేషన్ నందు కంప్లైంట్ ఇచ్చి జ్వాలాపురపు శ్రీకాంత్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని కోరాము అని పి. వి.ఫణి కుమార్ తెలిపారు. పోలీసు వారు అన్ని ఆధారాలు పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, బ్రాహ్మణ సంఘం నాయకుడు, నిమ్మగడ్డ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి : కలెక్టర్ డికే బాలాజీ.



**మచిలీపట్నం ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును తనిఖీ చేసి అందులోని ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో బూతు స్థాయి అధికారులకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం చాలా అవసరం ఉందన్నారు. వచ్చే ఏప్రిల్ నెలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి రాజకీయ పార్టీ వారికి చెందిన బూతు స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలన్నారు. తద్వారా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించుటకు అవకాశం లభిస్తుంద న్నారు. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ కొంతవరకు బూత్ సాయి ఏజెంట్లను నియమించిందని మిగిలిన పార్టీలు కూడా వెంటనే బిఎల్ఎ లను నియమించాలని సూచించారు. ఇప్పుడు బూతు సాయి ఏజెంట్లను నియమించుకోకుండా ఆ తర్వాత ఓటర్ల జాబితా సరిగా లేదని వేలెత్తి చూపడం సరికాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఫారం 6, 7, 8 క్లెయిములకు సంబంధించి మొత్తం 76,170 అర్జీలు అందగా అందులో 73,474 అర్జీలను పరిష్కరించామని, మిగిలిన 2,696 అర్జీలు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో 1769 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 32 పోలింగ్ కేంద్రాల స్థలాలను మార్చేందుకు ప్రతిపాదనలు చేశామని, మరో 170 పోలింగ్ కేంద్రాలను నామకరణం మార్చాలని ప్రతిపాదించామని, 73 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఆ ప్రకారం మొత్తం 1842 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, టిడిపి, బిజెపి, సిపిఐ, వైసీపీ, బీఎస్పీ ల ప్రతినిధులు బియం.వి.దాస్, పివి గజేంద్రరావు, కొడాలి శర్మ, సిలార్ దాదా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ భారత స్ఫూర్తితో నెస్లే కంపెనీ అడుగులు

**ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో ఏర్పడిన స్వచ్ఛభారత్ కార్యక్రమాలలో భాగస్వామ్యం అవడానికి పలు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కస్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా పిలుపునిచ్చారు.**



**నిడదవోలు ఫిబ్రవరి 23( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నిడదవోలు మండలంలోనీ PM Shari జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో స్వచ్ఛ బయో టాయిలెట్లను ప్రారంభ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా గారు మాట్లాడుతూ నెస్లే కంపెనీ సౌజన్యంతో నిడదవోలు ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్మించిన బయో టాయిలెట్స్ బ్లాక్ లను నెస్లే కంపెనీ రెండు తెలుగు రాష్ట్ర ల ఇంచార్జి వసీమ్ అహమ్మద్ లు కలసి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కూడా లేని సందర్భాలలో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న దశలో నెస్లే కంపెనీ యాజమాన్యం ముందుకు వచ్చి నిడదవోలు లోనీ ఆధునిక సౌకర్యాలు కలిగిన బయో టాయిలెట్స్ అందించా లన్న మంచి ఉద్దేశంతో ఈ టాయిలెట్స్ ను ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. నెస్లే కంపెనీ వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గ్రహించి ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ గారి స్వచ్ఛ భారత్ లక్ష్యము గా ముందు కెళ్తూ ఇలాంటి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సూచన మేరకు రాష్ట్రంలో నెస్లే కంపెనీ రెండు తెలుగు రాష్ట్రాల ఇంచార్జి వసీం అహ్మద్ సహకారంతో నెస్లే కంపెనీ యాజమాన్యం పలు సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని వాటిలో భాగంగానే తుఫాను బాదిత మత్స్యకారులకు రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కిట్స్ పంపిణీ చేయడం జరిగిందని ఇదే కాక నేడు ఈ బయో టాయిలెట్స్ కూడా ప్రారంభం చేయడం జరిగిందని ఇలాంటి కార్యక్రమాలకు సహకరిస్తున్న వసీం అహ్మద్ గారిని అభినందించారు. సేవ దృక్పథంతో పలు బయో టాయిలెట్స్ ఇచ్చిన పాఠశాలలో స్కూలు సిబ్బంది వీటిని పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజ సేవే మాధవసేవ అన్న నినాదంతో ప్రియతమ నరేంద్ర మోడీ గారి అడుగుజాడలలో నడుస్తూ సమాజంలో అందరూ భాగస్వాములు అయినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో దీజీవీజ ఏపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇమామ్, బందర్ పోర్టు ఇంచార్జి చీ. సురేష్ బాబు, నిజాంపట్నం పోర్టు ఇంచార్జి షేక్ బాజీ షరీఫ్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినిలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. . నిడదవోలు లోని PM. Shri జడ్పీ ఉన్నత పాఠశాలలోని బయో టాయిలెట్స్ ప్రారంభంనికి వచ్చిన ముఖ్య అతిధులు కు పాఠశాలలోని సిబ్బంది విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.



Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com